క్లుప్తంగా

నేటి నుంచి కార్తీక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ గ్రామ సమీపంలో ఉన్న శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో మొదటి కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఆదివారం సాయంత్రం తెలిపారు. ఆలయానికి వచ్చే అయ్యప్ప మాల ధరించిన భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకించి కార్తీక మాసంలో వచ్చే సోమవారాల్లో విశేష పూజలు చేస్తున్నట్లు చెప్పారు.

వైభవంగా స్కంధ షష్టి ఉత్సవాలు

నగరి: స్థానిక కరకంఠేశ్వర స్వామి ఆలయంలో స్కంధ షష్టి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిప్ంచారు. ఉదయం వళ్లిదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ నెల 7న శూర సంహారం, 8న కల్యాణోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యుత్ మోటార్ పరిశీలన


చెరువులో విద్యుత్ మోటార్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

విజయపురం: మండలంలోని కాళికాపురం చెరువులో మరమ్మతులకు గురైన విద్యుత్ మోటార్‌ను అధికారులు పరిశీలించారు. సాక్షి దినపత్రికలో శుక్రవారం 'గొంతెండుతున్న కాళికాపురం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి బేబిరాణి, ఈఓపీఆర్‌డీ రాజేంద్ర మోటార్‌ను పరిశీలించారు. చెరువులో నీరు ఉండడంతో మరమ్మతు చేయలేదని, ప్రస్తుతం ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా తాగునీరు అందిస్తున్నామని తెలిపారు.

నడకే నరకయాతన


కంకరతేలిన తారురోడ్డు

వెదురుకుప్పం: మండలంలోని గ్రామీణ రోడ్లు దుస్థితికి చేరుకున్నాయి. తారు రోడ్లు సైతం గుంతలు ఏర్పడి అక్కడక్కడా కంకరతేలి అధ్వానంగా తయారైంది. నల్లవెంగనపల్లె పంచాయతీ నుంచి రెంటాలచేను, చెంచుగుడి మీదుగా తిరుపతి–దేవళంపేట ప్రధాన రహదారి వరకు గతంలో ప్రజలకు సౌకర్యంగా తారు రోడ్డు వేశారు. అది ఇప్పుడు పలు చోట్ల రోడ్డు గుంతలు ఏర్పడి కంకరతేలి అటవీ ప్రాంతాన్ని తలపిస్తోంది. కంకర తేలిన రోడ్డుపై ప్రయాణికులు అడుగు పెట్టలేక అవస్థలు పడుతున్నారు. వాహచోదకులు సైతం వాహనాలను నడిపేందుకు సాహసం చేయాల్సిందేనని అంటున్నారు. ఈ రోడ్డుపై అల్లంవారికండ్రిగ, చింతలగుంట, చింతలగుంట ఎస్సీ కాలనీ, ఏపేరి, బాలుపల్లె, గుంతలచేను, రెంటాలచేను, చెంచుగుడి గ్రామాలకు చెందిన గ్రామస్తులు వెళ్తుంటారు. కంకర తేలిన రోడ్డుపై నడక సాగించాలంటే నరకయాతన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యాసరచనలో సత్తా చాటిన విద్యార్థిని


ఎస్పీ మణికంఠ చందోలు చేతుల మీదుగా నగదు తీసుకుంటున్న యశస్విని

గంగాధరనెల్లూరు: పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కాలేపల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని యశస్వినికి థర్డ్ ప్రైజ్ లభించింది. మండలంలోని ఒగ్గువారిపల్లి దళితవాడకి చెందిన కానిస్టేబుల్ దేవేంద్రం కుమార్తె యశస్విని కాలేపల్లి హైస్కూల్లో పదో తరగతి చదువుతోంది. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా చిత్తూరులో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థిని యశస్వినికి మూడో బహుమతి లభించింది. యశస్వినిని ఎస్పీ మణికంఠ చందోలు అభినందించి, అనంతరం ప్రోత్సాహక నగదు రూ.3 వేలను అందజేశారు. విద్యార్థిని యశస్వినిని కాలేపల్లి హైస్కూల్ హెచ్ఎం కేశవరెడ్డితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ముందు జాగ్రత్తలే శ్రీరామరక్ష

టీటీ అగ్రహారంలో ఆవులకు చికిత్స అందిస్తున్న పశువైద్యాధికారి



వ్యవసాయ రంగంలో పాడిపరిశ్రమ అత్యంత ప్రాధాన్యం కలిగింది. సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోవడంతో పాడి పశువులు అనేక వ్యాధులకు గురవుతున్నాయి. వర్ష, శీతాకాలాల్లో సీజనల్‌గా వచ్చే వ్యాధులతోపాటు, కొత్తగడ్డిని మేసే పశువులు, గొర్రెలు, మేకలు బలహీనంగా తయారయ్యే అవకాశం ఉంటుంది. గడ్డిపై పరాన్నజీవులు సోకిన పశువులు మలమూత్రాలను విసర్జించడం, ఆ గడ్డినే పశువులు గొర్రెలు, మేకలు మేయడం ద్వారా అంటు వ్యాధులు సోకి బలహీనపడుతాయి. సకాలంలో తగిన వైద్యం అందించకపోవడం ద్వారా అవి మృతి చెందే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇలా సీజనల్‌గా వచ్చే వ్యాధులు, వాటి లక్షణాలు, నివారణోపాయాలను వడమాలపేట పశువైద్యాధికారి డాక్టర్ ఎం.మురళీధర్‌రెడ్డి ఇలా తెలియజేస్తున్నారు. – పుత్తూరు

- గొంతు వాపు(గురక వ్యాధి)
- వ్యాధి లక్షణం: ఆయాస పడుతూ శ్వాస తీసుకోవడం. నాలుక బయటికి పెట్టి శ్వాస తీసుకోవడం, గురక శబ్దం వినబడడం, గొంతు పైభాగాన, కింది భాగాన వాపు రావడం. కళ్లు ఎర్రబడి నీరు కారడం, జ్వరం తీవ్రత 104 నుంచి 106 ఫారన్‌హీట్ వరకు పెరిగి 24 గంటల్లో పశువు చనిపోవడం. ఈ వ్యాధి ఎక్కువగా గేదెల్లో, గొర్రెల్లో కనబడుతుంది.
- చికిత్స: గొంతు వద్ద వాపు కనిపించిన వెంటనే పశు వైద్యశాలకు తీసుకొచ్చి సల్ఫా మందును ఇంజెక్షన్ ద్వారా 5 రోజులపాటు ఇవ్వాలి. ముందు జాగ్రత్తగా టీకా మందును వాడవచ్చు.
- దొమ్మ రోగం:
- వ్యాధి లక్షణం: ముక్కు, నోటి నుండి రక్తంతో కూడిన పదార్థం వస్తుంది. విపరీతమైన కడుపు నొప్పి ఉంటుంది. రక్త విరేచనాలు అవుతాయి. జ్వరం ఎక్కువై రెండు మూడు గంటల వ్యవధిలో పశువు అకస్మాత్తుగా చనిపోతుంది.
- చికిత్స: దొమ్మ రోగం సోకిన పశువును సాధ్యమైనంత త్వరగా డాక్టర్ వద్దకు తీసుకొచ్చి యాంటీబయాటిక్ మందులతో చికిత్స అందించాలి. వర్షాకాలానికి ముందు ప్రతిఏటా జూన్, జులై మాసాల్లో వ్యాధి నిరోధక టీకా వేయించాలి. ఈ వ్యాధి లక్షణాలతో చనిపోయిన పశువు కళేబరాన్ని కోయరాదు.


పశువులకు పిడుదుల మందు పిచికారీ

వ్యాధితో చనిపోయిన పశువు ముక్కు, నోటి నుంచి క్రిములు బయటకు రాకుండా దూదిని నింపాలి.

- జబ్బువాపు
- లక్షణాలు: 6 మాసాల నుంచి 2 సంత్సరాల వయస్సు కలిగిన తెల్లజాతి పశువుల్లో ఈ వ్యాధి ఎక్కువగా కనబడుతుంది. జబ్బ, తొడ భాగంలో వాపు ఉండి, అక్కడ వేడిగాను ఉంటుంది. వాపు ఉన్న చోట కరకరమని శబ్దం చిన్నగా వినిపిస్తుంది. జ్వరం తీవ్రంగా ఉంటుంది. కుంటుతూ నడుస్తాయి. చిన్న పశువులు అకస్మాత్తుగా మృతి చెందుతాయి.
- చికిత్స: వ్యాధి లక్షణాలు కనబడిన వెంటనే డాక్టర్ వద్దకు తీసుకొచ్చి యాంటీబయాటిక్స్ మందులు వాడాల్సి ఉంటుంది. ప్రతి వర్షా కాలానికి ముందు వ్యాధి నిరోధక టీకా విధిగా వేయించాలి.
- సర్రా (కుందేటి వెర్రి)
- లక్షణాలు: ఏకకణ సర్రా పరాన్నజీవులు జోరీగల ద్వారా రక్తంలోకి ప్రవేశించి వ్యాధిని వ్యాప్తి చేసే ఈ వ్యాధిని సర్రా లేదా టిపనసోమీయాసిస్ తిరుగుడు వ్యాధి అని కూడా అంటారు. వ్యాధి సోకిన పశువును కుట్టిన జోరీగ మరో పశువును కుట్టడంతో ఆ పశువుకు కూడా వ్యాధి సంక్రమిస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువులు వెర్రి చూపులు చూడడం, బలహీన పడిపోతాయి. పండ్లు కొరుకుతూ గుండ్రంగా తిరుగుతాయి. మూత్ర విసర్జన ఎక్కువగా చేస్తాయి. ఒక్కోసారి హఠాత్తుగా మృతి చెందుతాయి.
- చికిత్స: వెంటనే డాక్టర్‌ను సంప్రదించి గ్లూకోజ్, విటమిన్లు ఇప్పించాలి. జోరీగలు పశుపాకల్లోకి ప్రవేశించకుండా క్రిమిసంహారక మందులు పిచికారీ చేయించాలి. ఈ వ్యాధికి టీకా లేదు.

వైద్యుల సలహాలు పాటించాలి



పాడి రైతులు ముందస్తు నివారణ చర్యలు చేపట్టడం ద్వారానే పశువులను రక్షించుకునేందుకు వీలుంటుంది. డాక్టర్ల సలహా మేరకే మందులు వాడాలి. పాడి రైతులు తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. రైతు సేవా కేంద్రాల్లో గొర్రెలు, మేకల పెంపకందారులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నాం. రోగనిరోధక శక్తి పెంచడానికి పశువులకు మిశ్రమ లవణాలు, పాతర గడ్డి ఇవ్వాలి. సబ్సిడీతో గడ్డిని పొందాలంటే పశుసంవర్ధక శాఖలో సంప్రదించాలి.

– డాక్టర్ ఎం.మురళీధర్‌రెడ్డి, పశువైద్య సహాయ శస్త్ర చికిత్స నిపుణులు, వడమాలపేట పశు వైద్యశాల

వణికిస్తున్న వానరసేన



భవనంపై దాడులు చేస్తున్న కోతి మూక, గేటు ఎక్కి ఇంట్లోకి వెళ్తున్న కోతులు

పాలసముద్రం: కోతుల బెడదతో మండలంలో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మండలంలోని బలిజకండ్రిగ, శ్రీకావేరిరాజుపురం, అయ్యప్పరాజుకండ్రిగ, పాలసముద్రం గ్రామాల్లో ఏ వీధిలో చూసినా వానర సైన్యం నిండిపోయింది. కోతుల బెడద తట్టుకోలేక స్థానికులు నిత్యం తమ చేతుల్లో కర్రలు పట్టుకుని తిరిగే పరిస్థితి ఏర్పడింది. వీధుల్లో గృహాల ముందున్న అరుగులపై మహిళలు, చిన్నపిల్లలు ఉండే పరిస్థితి లేకుండా పోయింది. సాయంత్రం వేళల్లో మహిళలు అరుగులపై కూర్చునే సమయంలో కోతులు అధికంగా వచ్చి వారిపై దూకుతున్నాయి. దీంతో వారు భయభ్రాంతులకు గురై వణికిపోతున్నారు. ఎవ్వరూ లేని సమయంలో ఇంటిలోకి ప్రవేశించి వంట గదిలో కూరగాయలు, వండిన ఆహారాన్ని నాశనం చేస్తున్నాయి. కోతులను తరమడానికి కర్రలతో వెళ్లితే అవి గుంపుగా చేరుకుని దాడి చేస్తున్నాయి. బజారుకు వెళ్లి కూరగాయలు తెచ్చుకోవాలన్నా వెళ్లలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వీధుల్లో చిన్నారుల చేతుల్లో పండ్లు, తినుబండారాలు ఉన్నట్లు గమనిస్తే చాలు వెంటనే వారిపై దూకి లాక్కుపోతున్నాయి. కోతిమూకల నుంచి తమను రక్షించాలని ప్రజలు పంచాయతీ అధికారులను కోరుతున్నారు.

గోల్‌మాల్ గోకులం

పాలసముద్రం: మండలంలో గోకులం షెడ్ పేరుతో అధికార పార్టీ నాయకులు గోల్‌మాల్ చేస్తున్నారు. టీడీపీ నాయకులకు పాడి పశువులు లేకపోయినా షెడ్ మంజూరు లిస్టులో పేరు ఉంది. అధికారం ఉందని పాత వాటిని కొత్తగా చూపి బిల్లు స్వాహా చేసుకుందామని సిద్ధం చేస్తున్నారు. ఈ దోపిడీలో పశుసంవర్ధక శాఖ అధికారులు క్రియాశీలకంగా మారుతున్నారు. మండల పరిధిలో 50కి లోపే గోకులం షెడ్లు మంజూరయ్యాయి. ఇందులో అధికార పార్టీ బడా నాయకుల పేర్లు ఉన్నాయి. ఇదంతా జిల్లా ఉన్నతాధికారుల కనుసన్నల్లో మండల అధికారులు, ఉపాధి హామీలో గోకులం షెడ్ నిర్మాణంలో దోపిడీకి సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మండలంలో మంజూరైన గోకులాల షెడ్ లిస్టుని క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన పాడి రైతులకు మంజూరు చేయాలని పాడి రైతులు కోరుతున్నారు.

ఘనంగా జల హారతి


జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే థామస్

కార్వేటినగరం: మండలంలోని కృష్ణరాజసాగర్ ప్రాజెక్టు వద్ద నిర్వహించిన జల హారతి కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సాంప్రదాయబద్ధంగా జలహారతి ఇస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెంగల్రాయ్ యాదవ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పూర్తి కాని రోడ్డు పనులు


రోడ్డు పనులు చేసేందుకు వేసిన కంకర రాళ్లు

పాలసముద్రం: మండలంలోని వీర్లగుడి గ్రామానికి వెళ్లే రోడ్డు పనులు ఎప్పుడు పూర్తి చేస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదు నెలలుపైగా అయిపోయినా రోడ్డు పనుల గురించి పట్టించుకోవడం లేదు. రోడ్డుపై ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని అంతా కోరుతున్నారు.

సేవలు దూరం

గ్రామ స్వరాజ్య సాధన కోసం వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఈ వ్యవస్థ సక్రమంగా సాగేందుకు వీలుగా అవసరమైన ఉద్యోగులను నియమించింది. మీ సేవ, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల్లో అందించే సేవలన్నింటినీ సచివాలయాల పరిధిలోకి తీసుకొచ్చింది. గత ఐదేళ్ల కాలంలో ఏ పని కావాలన్నా ప్రజలు సచివాలయాన్నే ఆశ్రయించేవారు. ఇటీవల అధికార పగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వంలో ఈ వ్యవస్థ ఉంటుందా లేదా మూత పడుతుందా అన్న సందిగ్ధం నేటికీ నెలకొంటది. ఆన్‌లైన్ సేవలందించే వెబ్‌సైట్లు ఇప్పటికీ తెరుచుకోకపోవడం దీనికి నిదర్శనం. – విజయపురం


రేషన్‌కార్డు నమూనా

- నేటికీ తెరుచుకోని వెబ్‌సైట్లు
- ఆరోగ్యశ్రీ, రేషన్‌కార్డు, పింఛన్ కోసం ఎదురుచూపులు

అన్నింటికీ రేషన్ కార్డు లింక్

ప్రస్తుతం సచివాలయాలు సాగుతున్నా వాటి నుంచి అందించే సేవలకు అవాంతరాలు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టాక పాత వ్యవస్థలను తెరపైకి తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. దీంతో ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కొన్ని వెబ్‌సైట్లు మూతపడ్డాయి. ఫలితంగా ప్రజలు అనేక ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. పట్టణాలు, పల్లెల్లో ప్రజలకు సత్వరమే సమస్యలు పరిష్కారం అయ్యేలా ఏర్పాటైన సచివాలయాలు ప్రస్తుతం ప్రజలకు ఉపయోగకరంగా లేవనే భావన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా వెబ్‌సైట్లు పనిచేయకపోవడంతో ఆరోగ్యశ్రీలో వైద్య సేవలు పొందే రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సేవలకు నిరాకరిస్తున్నారు. అలాగే పింఛన్ పొందాలంటే, ఉచిత సిలిండర్ పొందాలంటే రేషన్, ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలి. అయితే కొత్త రేషన్ కార్డు కోసం సచివాలయానికి వెళ్తే సచివాలయ వెబ్‌సైట్లు పని చేయడం లేదనే సమాధానం తప్ప ఇంకేమీ రావడం లేదు. ఎప్పుడు వెబ్‌సైట్లు తెరుచుకుంటాయనే ప్రశ్నకు వారి నుంచి సమాధానం లభించడం లేదు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి ప్రజలకు కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు వచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తప్పని ఎదురుచూపులు

నగరి నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 78 సచివాలయాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయాల్లో సేవలు నిర్వీర్యమయ్యాయనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కూటమి సర్కారు అధికార పగ్గాలు చేపట్టి 5 నెలలు అయినా కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు నమోదుకు చర్యలు తీసుకున్న పరిస్థితి లేదు. పథకాలకు సంధించిన వెబ్‌సైట్లు పని చేయకపోవడంతో ప్రజలు సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గతంలో ఏ పనికైనా సచివాలయాలకు వెళ్లే పరిస్థితి ఉండడంతో సందడిగా కన్పించేవి. ప్రస్తుతం ఆ వాతావరణం కన్పించడం లేదు. రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు వెళ్తున్న ప్రజలకు నిరాశ ఎదురవుతోంది.

తక్షణమే వెబ్‌సైట్లు ఓపెన్ చేయాలి

"కూటమి ప్రభుత్వం వస్తే ప్రజల కష్టాలు తీరుతాయని ఆశించాం. సచివాలయాల్లో వెబ్‌సైట్లు ఓపెన్ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఏదైనా రోగమొచ్చి ఆసుపత్రికి వెళితే ఆరోగ్యశ్రీ కార్డు లేనిదే వైద్యం అందించడం లేదు. తక్షణమే ప్రభుత్వం స్పందించి వెబ్‌సైట్లు ఓపెన్ చేయించేలా చర్యలు తీసుకోవాలి.

– భాస్కర్‌రెడ్డి, కళియంబాకం, విజయపురం

ప్రజలకు సేవ చేయాలి

సచివాలయాల్లో తక్షణమే వెబ్‌సైట్లు ఓపెన్ చేసి, ప్రజలకు సేవలు అందించాలి. ఇప్పటికే ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు అవుతున్నప్పటికీ ఆరోగ్యశ్రీ కార్డులు, కొత్త రేషన్ కార్డులు, కొత్త పెన్షన్‌దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ప్రచారాలు మానుకుని ప్రజల అవసరాలు తీర్చాలి.

– శాంతకుమార్, అర్కేరి, పుత్తూరు

క్రికెట్ విజేత తయ్యూరు


గెలుపొందిన పెద్దతయ్యూరు క్రీడాకారులు

శ్రీరంగరాజపురం: మండలంలోని యూఎం పురం గ్రామంలో నిర్వహించిన దీపావళి క్రికెట్ టోర్నమెంట్‌లో పిళ్లారికుప్పం గ్రామంలో చిన్నతయ్యూరు గ్రామానికి చెందిన క్రీడాకారులు విజేతగా నిలిచారు. గెలుపొందిన జట్టుకు రూ.50 వేలు నగదు బహుమతితోపాటు కప్‌ను అందించారు. ఈ క్రీడలలో ప్రతిభ చాటిన హిమచలపతికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, రాజేష్‌కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులను అందించారు. గెలుపొందిన క్రీడాకారులకు గ్రామస్తులు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి, మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ గెలుపొందిన క్రీడాకారులను అభినందించి సన్మానం చేశారు. గ్రామ సర్పంచ్ వరదమ్మ మాట్లాడుతూ మానసిక ఉల్లాసంతోపాటు గ్రామాల్లో దాగి ఉన్న ప్రతిభని వెలికి తీయడానికి ఈ టోర్నమెంట్లు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. పంచాయతీ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడానికి క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

సారా తయారీపై ఉక్కుపాదం


సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

కార్వేటినగరం: సారా తయారీ, అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కనికాపురం, గోపిశెట్టిపల్లి గ్రామాల సమీపంలోని చెరకు తోటలు, అటవీ ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధం చేసిన 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ అక్రమ మద్యం తయారీ, అమ్మకాలు జరపడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సారా తయారీ చేసిన వారిపై కేసులు నమోదు చేసి రిమాండుకు తరలించడమే కాకుండా భారీగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. సారా తయారీ మానేసి ప్రజా జీవనం గడపాలని సూచించారు. గ్రామాల్లో అక్రమ సారా అమ్మకాలు, తయారీ చేపడుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించి, అక్రమ వ్యాపారాలను కట్టడి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

శ్రీరంగరాజపురం: ఉన్నత స్థానాలకు చేర్చిన పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని శ్రీరంగరాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు తెలిపారు. 1997–1998 సంవత్సర పూర్వ విద్యార్థులు సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి అరుణాచలం రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్యతోనే విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకుంటారన్నారు. తాము విద్యను బోధించిన విద్యార్థులు ప్రస్తుతం తహసీల్దార్, ఎంపీడీఓ, పారిశ్రామిక వేత్తలు, డాక్టర్లుగా వివిధ రంగాల్లో స్థిరపడి ఉన్నత స్థితికి ఎదగడం ఆనందంగా ఉందన్నారు. గతంలో ఉపాధ్యాయులను సమాజం గౌరవంగా చూసేదని, ప్రస్తుతం విద్య వ్యాపారం కేంద్రంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు స్వేచ్ఛాయుతమైన విద్య అందుతుందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు నేర్పిన నైతిక విలువలు, చదువు, వారి ప్రేరణ తమ ఉన్నత స్థితికి ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. భారీ కేక్‌కట్ చేశారు. పూర్వ ఉపాధ్యాయులను సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. తాము చదువుకున్న పాఠశాలకు నేమ్ బోర్డు, పాఠశాల మరమ్మతులకు నగదు, బీరువా, డెస్కులు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, మాజీ ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, కోదండ, చంద్రశేఖర్, జయచంద్ర, రామచంద్ర, నీలవర్ణం, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు స్వాహా

- ఎంపీడీఓ చేతివాటం?

ఉప సర్పంచ్, వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమానికి విడుదల చేసిన నిధులను విజయపురం ఇన్‌చార్జి ఎంపీడీఓ స్వాహా చేసినట్లు ఆరోపణ వినిపిస్తున్నాయి. ఇటీవల ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం జరిగింది. ఇందుకు గాను కేంద్రంరూ.1,28,558 నిధులు మంజూరు చేసింది. అయితే వార్డు సభ్యులకు నిధులు ఇవ్వకుండాహా చేసినట్లు తెలుస్తోంది.

– విజయపురం



ఎంపీడీఓ డ్రా చేసిన బ్యాంక్ స్టేట్‌మెంట్

విజయపురం మండలంలో మొత్తం 25 పంచాయతీలలో ఒక్కో పంచాయతీకి ఉపసర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యుల చొప్పున మొత్తం 75 మందికి రెండు రోజులపాటు శిక్షణ ఇవ్వాలి. అయితే రెండు రోజులు జరిగిన శిక్షణ కార్యక్రమానికి కేవలం 20 మంది మాత్రమే హాజరయ్యారు. హాజరైన వాళ్లకి ఒక నోట్ బుక్, ఒక పెన్నుతో పాటు, స్నాక్స్, భోజనం పెట్టాలి. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటలకు వరకు జరగాల్సిన శిక్షణ కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా నిర్వహించి చేతులు దులిపేసుకున్నారు. 20 మంది వార్డు సభ్యులకు కనీసం రూ.5వేలు కూడా ఖర్చు పెట్టకుండానే రూ.1,28,558 ఖర్చు చేసినట్లు రికార్డు సృష్టించి, ఆ మొత్తాన్ని డ్రా చేశారు. డ్రా చేసిన నిధులను అధికారులు పంచుకున్నట్లు ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.

రెండు విడతలు

వార్డు సభ్యుల నిధులను గత నెలలో రెండు విడతలుగా డ్రా చేశారు. 23.10.2024 తేదీ చెక్ నెంబర్(019120)రూ.54,208, 24.10.2024 తేదీ (చెక్ నెంబర్ 019121) రూ.74,350 డ్రా చేయగా, రూ.978 అకౌంట్లో ఉంది. డ్రా చేసిన డబ్బును కొంత మంది ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు అందించి, మిగిలిన డబ్బును స్వాహా చేసినట్లు ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.


ఫోర్జరీ సంతకాలు

వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో మొత్తం 75 మంది హాజరు కావాలి. అయితే రెండు రోజులు జరిగిన శిక్షణ కార్యక్రమంలో కేవలం 20 మంది మాత్రమే హాజరయ్యారు. మిగిలిన 50 మంది సభ్యులు హాజరుకాలేదు. అయితే శిక్షణ కార్యక్రమానికి హాజరు కాని సభ్యుల సంతకాలను ఫోర్జరీ చేసి నిధులను స్వాహా చేసినట్లు గట్టిగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు దీనిపై దృష్టి పెట్టాలని వివిధ పార్టీల నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారు.

జోరుగా వరి సాగు


వెంగళరాజుకుప్పంలో వరి నాట్లు

పాలసముద్రం: ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు రబీ సాగుకు శని, ఆదివారాలు రెండో విడత దుక్కులు చేసి, సన్నద్ధమవుతున్నారు. మండలంలో సాగు చేయాల్సిన విస్తీర్ణం 830 హెక్టార్లుగా ఉంది. అందులో ప్రస్తుతం బోర్లు, బావుల కింద ఉన్న రైతులు 570 హెక్టార్ల భూమిలో వరి, మరి కొంత మంది రైతులు 90 హెక్టార్లు వేరుశనగ సాగు చేస్తున్నారు. రైతులు ఏ పంట సాగు చేసిన ఎక్కువగా రసాయన ఎరువులు, పురుగు మందులను వాడడంతో భూములు మొద్దుబారిపోయి దిగుబడి తగ్గిపోతుందన్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగా అభించే ఆకులతో జీవామృతం, ఘనజీవామత్యం తయారు చేసుకుని పంటకు ఉపయోగిస్తే అధిక దిగుబడి పొందవచ్చన్నారు. వేరుశనగ, వరి పంట సాగు నెలాఖరు వరకు చేసుకుంటే మంచి అదునని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు.


వరి నారు తీస్తున్న కూలీలు